చేనేత కార్మికులతో ముఖాముఖి

చేనేత కార్మికులను ఆదుకుంటాం : నారా లోకేష్

నేడు వెంకటగిరిలో వెబ్‌సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వెంకటగిరి

తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రాగానే 50శాతం సబ్సిడీతో చేనేత కార్మికులకు మగ్గాలను అందజేసి ఆదుకుంటామని తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. వెంకటగిరిలో గురువారం వెబ్‌సైట్‌ను ఆవిష్కరించనున్నారు. దళారులు లేకుండా మంచి ధరకు చేనేతలే తమ ఉత్పత్తులు అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బుధవారం డక్కిలి క్యాంప్ సైట్‌లో చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. సాయంత్రం పాదయాత్రగా డక్కిలి నుండి లింగసముద్రం, మోపూరు క్రాస్‌రోడ్డు, మిట్టపాళెం గ్రామం మీదుగా వెంకటగిరిలోని కాంపాళెం ప్రాంతంలో క్యాంప్ సైట్‌లో బసచేశారు. చేనేత కార్మికులతో ఆయన మట్లాడుతూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేనేత కార్మికులకు అందించే సబ్సిడీలను ఎత్తి వేశారన్నారు. టిడిపి హయాంలో ఒక్క సంతకంతో 110కోట్లు రుణమాఫీ చేశామన్నారు. ఆదరణ పథకం ప్రవేశపెట్టి 50శాతం సబ్సిడితో మగ్గాలను అందించామన్నారు. 60మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నా ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఆయా కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించలేదన్నారు. అధికారంలోకి రావాలనే లక్ష్యంలో అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేదన్నారు. చేనేత కార్మికులు పాలిచ్చే ఆవుని వద్దని తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుగంగ మెయిన్ కాలువ 34.290 కిలోమీటరు వద్ద ఓటీ స్లూయిజ్ పనులు గత తెలుగుదేశం ప్రభుత్వ మంజూరు చేసిందన్నారు. ఈప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ పనులు చేయలేదన్నారు. ఈస్లూయిజ్ పనులు పూర్తి చేస్తే నాయుడుపాళెం, చాకలపల్లి, పాతనాలపాడు, కొత్తనాలపాడు, మోపూరు కెబిపల్లి, యల్లావజ్జులపల్లి గ్రామాల ఉపయోగం ఉంటుదని తెలియజేశారు. పార్టీ అధికారంలోకి రాగానే ఈపనులు చేస్తామని హామి ఇచ్చారు. ఈపాదయాత్రంలో ఈయనతో పాటు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తెలుగుదేశం నాయకులు డాక్టర్ మస్తాన్ యాదవ్, మాజీ శాసనమండలి చైర్మన్ షరీఫ్, ఎమ్మెల్యే ఆనం కుమారై, ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగోటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుమల కొండపై జోరు వాన

'తొలకరి' పలకరింపు..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వడగాల్పులు, మండిపోయే ఎండలతో జనాన్ని భయపెట్టిన ఎండల నుంచి ఆదివారం నుంచి కురుస్తున్న తొలకరి జల్లులతో ఉపశమనం లభించింది. భగభగ మండే ఎండల నుంచి జనం ఊపిరి పీల్చుకున్నారు. మూడు రోజులుగా అడపాదడపా వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ ప్రభావం తిరుపతి జిల్లాలోనూ కనిపించింది. వాతావరణం మేఘావృతమై ఆహ్లాదకరంగా మారడంతో చాలా రోజుల తరువాత జనం మిట్టమధ్యాహ్నం సైతం రోడ్డుపైన కనిపించారు. రైతులు సైతం తొలకరి జల్లులతో దున్నకాలు ప్రారంభించేందుకు సమాయత్తం కానున్నారు.

నైరుతి రుతుపవనాల ప్రభావంతో రానున్న రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ భారీవర్షాలు, మిగిలినచోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డా.బిఆర్ అంబేద్కర్ తెలిపారు. బుధవారం పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి , కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. విజయనగరం, విశాఖ, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

గురువారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అనకాపల్లి, కాకినాడ, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయంటున్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయంటున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో వర్షాలు ఊపందుకోనున్నాయి. ఈ వానలతో రైతులు పొలం పనులకు సిద్ధం అవుతున్నారు. మొత్తానికి రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వానలు పడుతున్నాయి.

కరెంట్ బిల్లుల భారంతో జనం బెంబేలు : సిపిఎం

సత్యవేడు : కరెంట్ బిల్లులను జగన్ సర్కార్ నెలనెలా పెంచుతూ పోవడం వల్ల జనం బెంబేలెత్తుతున్నారని సిపిఎం మండల నాయకులు రమేష్ అన్నారు. స్మార్ట్‌మీటర్లను తెచ్చి రైతుల నడ్డివిరిచి కార్పొరేట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచిపెడుతున్నాయన్నారు. 'విద్యుత్ బిల్లుల భారం'పై సర్వే చేస్తున్న నేపథ్యంలో ఏ ఇంటికి వెళ్లినా జనం మండిపడుతున్నారన్నారు. గ్యాస్ భారంలా నెలనెలా కరెంట్ బిల్లులను పెంచుకుంటూ పోతే తగిన బుద్ధి చెబుతామని వినియోగదారులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు. బొగ్గు రవాణా చేసే ఓడరేవును అదానీకి అప్పగించి, నేడు స్మార్ట్‌మీటర్లను తయారు చేయడాన్ని ఆ కంపెనీకే దోచిపెడుతన్నారన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్ క్రమంగా నీరుగారుస్తున్నారన్నారు. ఒకేసారి భారం మొత్తాన్ని కట్టమంటే వినియోగదారులు మండిపడతారని సర్దుబాటు పేరుతో నెలనెలా వడ్డిస్తున్నారన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

నాయుడుపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై అదనంగా మోపుతున్న కరెంట్ బిల్లులకు వ్యతిరేకంగా నాయుడుపేట సిఐటియు కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకవి, ముకుంద మాట్లాడుతూ ప్రపంచంలో అదానీని సంపన్నుడిని చేయడానికి సామాన్య ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నా

కరెంట్ షాక్‌తో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - తడ

మండలంలోని ఎపిఐఐసి రోడ్డు, నేషనల్ హైవే కలిసే మలుపు వద్ద బైక్ మెకానిక్ షాపులో బైక్ వాటర్ సర్వీసు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అశోక్‌కుమార్ (35) అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వాటర్ సర్వీసు చేస్తుండగా బైక్ ద్వారా కరెంట్ పాసై షాక్ కొట్టి పడిపోయారు. ఎవరూ గమనించకపోవడంతో అప్పటికే మృతిచెందాడు. తడ పోలీసులు అందించిన సమాచారం మేరకు సూళ్లూరుపేట మండలం అటకానితిప్ప గ్రామానికి చెందిన సుగానందం అశోక్‌కుమార్ (35) అన్న సుగానందం బాలసుందరం ఇరువురూ కలిసి మూడు నెలల కిందట హైవే రోడ్డులో అపాచి రోడ్డుకు తిరిగే మలుపు వద్ద బైక్‌లను రిపేర్‌చేసే చిన్న సర్వీసు షాపు ప్రారంభించారు. బుధవారం బైక్ సర్వీసు చేస్తుండగా అశోక్‌కుమార్ విద్యుత్ షాక్‌తో విగతజీవుడై పడి ఉన్నాడు. బాలసుందరం వచ్చి చూసేసరికి అప్పటికే మరణించి పడి ఉన్నాడు. కరెంట్ సప్లై ఆఫ్ చేసి 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతిచెందినట్లుగా డాక్టర్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాన్ని అప్పగించనున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. అశోక్‌కుమార్‌కు భార్య, నాలుగేళ్ల బాబు ఉన్నాడు. ప్రస్తుతం ఆమె గర్భవతి. రన్నారు. జనార్ధన్, భూపతి, రఫీ పాల్గొన్నారు.

తలకోన చైర్మన్‌గా భూమిరెడ్డి ప్రమాణస్వీకారం

రూ.4 లక్షలతో గుడి గోపురం నిర్మాణం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గా బోడెవాండ్లపల్లి పంచాయతీకి చెందిన భూమిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి బుధవారం ఆలయ ప్రాంగణంలో ఈవో జై కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ప్రసన్న స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ తిరుమలను తలపించే విధంగా తలకోనను ఆధ్యాత్మికంగా అభివద్ధి చేస్తూ నాలుగు మాడ వీధులు, కోనేరు ,తాగునీరు ,వైద్య సౌకర్యం, తలకోన జలపాతం అభివద్ధి, మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివద్ధి చేస్తామన్నారు. అలాగే నాలుగు లక్షల వ్యయంతో అమ్మవారి గుడి గోపురాన్ని తన సొంత ఖర్చులతో నిర్మిస్తామని తెలిపారు. తలకోనలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా మాంసం మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎంఆర్సి రెడ్డి, జడ్పిటిసి కరుణాకర్ రెడ్డి, మండల కన్వీనర్ నాగార్జున రెడ్డి, మాజీ తలకోన చైర్మన్ రేవతి రెడ్డప్ప రెడ్డి, ఎంపీటీసీ చందన రెడ్డి, ఎంపీడీవో అమర్నాథ్, సీఐ తులసిరామ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

'నాడు- నేడు' నెలాఖరుకల్లా పూర్తవ్వాలి : జేసీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు -నేడు కార్యక్రమంలో భాగంగా నిర్మితమవుతున్న పాఠశాల భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటు వేగవంతం చేసి జూన్ నెల ఆఖరి నాటికి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ డి కె బాలాజీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు మనబడి, నాడు - నేడు, జగనన్న విద్యా కానుక, తదితర మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవో, డిప్యూటీ డిఇఓ మండల విద్యాశాఖ అధికారులు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. లక్ష్యం మేరకు దశలవారీగా రెండవ దశ నాడు నేడు పనులలో పురోగతి ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాల భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న వాటిలో స్టేజి వారి పురోగతి ఉండేలా చర్యలు చేపట్టి జూన్ ఆఖరి లోపు పాఠశాలల మౌలిక సదుపాయాలు పూర్తి కావాలని అన్నారు. జిల్లాలో మంజూరు చేసిన 398 కిచెన్ షెడ్లలో 395 పురోగతిలో ఉన్నాయని తెలిపారు. పాఠశాలల్లో విద్యుదీకరణ పనులు 632 గాను 631 పురోగతిలో ఉన్నాయని, మిగిలినవి గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు. జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో అందించి బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. నాడు నేడు ఫేజ్ 1లో పూర్తికాకుండా మిగిలిన పనులను ఫేజ్ 2 ఏలో 886 పాఠశాలలో రూ.25.23 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. ఎస్టిమేట్లను శుక్రవారం లోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఉద్దేశించారు. ప్రతి బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శేఖర్, ఎస్ ఎస్ ఎ ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి సురేష్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఆఖరి అవకాశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి అర్ధ సంవత్సరం ఆస్తిపన్నులపై వడ్డీ లేకుండా చెల్లించడానికి నెలాఖరు వరకు గడువుందని, పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ హరిత ఓ ప్రకటనలో తెలిపారు. జులై 1 నుంచి పన్ను బకాయిలపై వందకు రెండు రూపాయల వంతున వడ్డీ పడుతుందని తెలిపారు. ఆస్తి, ఖాళీ జాగాపన్నులు, నీటిఛార్జీలు, యుడిఎస్ పన్నులన్నీ నెలాఖరులోపు చెల్లించి పన్నునుంచి మినహాయింపు పొందాలని కోరారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి

వినాయకసాగర్ వద్ద నిర్మిస్తున్న స్విమ్మింగ్‌పూల్‌ను ఆధునిక వసతులతో ఉండేలా చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కరకంబాడి మార్గంలో పలు అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. పనుల జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐల్యాండ్ మార్గంలో బారికేడ్ మధ్య ఎక్కువ గ్యాప్ ఉందని, పిల్లలకు ఇబ్బంది లేకుండా డబుల్ బారికేడ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్లే ఏరియా చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. లీలామహల్ కూడలి నుంచి కరకంబాడి మార్గంలో ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ కాల్వలను పరిశీలించారు. డ్రైనేజీ కాల్వలపై కప్పులేని ప్రాంతంలో గ్రిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కోమలమ్మ సత్రంలోకి శ్రీనివాస కల్యాణం ప్రాజెక్ట్

తిరుపతి బ్యూరో : తిరుపతి శ్వేత భవనంలోని టీటీడీ శ్రీనివాస కల్యాణం , వైభోత్సవాల ప్రాజెక్ట్ కార్యాలయాన్ని కోమలమ్మ సత్రం ప్రాంగణంలోకి మార్చారు. బుధవారం జేఈవో సదాభార్గవి కోమలమ్మ సత్రంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఈఓ మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి సూచనల మేరకు 1.5 ఎకరాల విస్తీర్ణంలోని కోమలమ్మ సత్రం లో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు శ్రీ శ్రీనివాస కల్యాణం ప్రాజెక్ట్ లోని స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఇక్కడ ఉంచి నిత్య పూజ, కైంకర్యాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనంద తీర్థా చార్యులు, విజివో మనోహర్, డిపిపి ప్రోగ్రామింగ్ ఆఫీసర్ రాజగోపాల రావు, డిపిపి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసులు, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.



రుమటాలజీ @ 'సుభోదయ '

ప్రజాశక్తి-తిరుపతి అర్బన్

తిరుపతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అతి తక్కువ ధరకు సుభోదయ హాస్పిటల్ అందుబాటులో ఉంచిందని ఆ ఆసుపత్రి అధినేత డాక్టరు పి. దామోదరం తెలిపారు. స్థానిక తిరుచానూరు రోడ్డులోని లక్ష్మీపురం సర్కిల్ సమీపంలో కెనెడా నగర్లో ఏర్పాటు చేసిన ఆసుపత్రి వద్ద ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

తిరుపతిలోని సుభోదయ రుమటాలజీ సెంటర్లో సహాయక, స్నేహపూర్వక సిబ్బంది ఉన్నారు . రోగులకు సహాయం చేయడానికి సరికొత్త వైద్య పరిజ్ఞానం ఉంది. ఈ రంగంలో నైపుణ్యం కోసం యంగ్ ఇన్వెస్టిగేటర్ అవార్డ్ 2011, బెస్ట్ పేపర్ అవార్డ్ 2011 గ్రాంట్ ఫర్ రీసెర్చ్ 2009 వంటి అవార్డులను గెలుచుకున్నారు. కోవిడ్-19 ముందు జాగ్రత్త చర్యలతో సహా అవసరమైన అన్ని భద్రతా ప్రోటోకాల్లకు క్లినిక్ కట్టుబడి ఉంది. డాక్టర్ల బృందం ప్రపంచ స్థాయి. సంరక్షణ, మార్గదర్శకత్వాన్ని అందిస్తారు, ఎల్లప్పుడూ రోగులకు మొదటి స్థానం ఇస్తారు. రుమటాలజీ, రుమాటిజం ట్రీట్మెంట్, సోనోగ్రఫీ మొదలైన సేవలు ఇక్కడ అందించబడుతున్నాయి. సమీప భవిష్యత్తులో సుభోదయ రుమటాలజీ సెంటర్ను సందర్శించాలని ప్లాన్ చేస్తున్నట్లయితే, వేచి ఉండే సమయాన్ని అందించబడును. నివారించడానికి ముందుగానే అపాయింట్ మెంట్ బుక్ చేసుకోవడం మంచిది. పని గంటలు 00:00 - 23:59. క్యాష్, క్యాష్ ఆన్ డెలివరీ, కార్డ్ ఆన్ డెలివరీ, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్, వీసా కార్డ్, మాస్టర్ కార్డ్, వంటి బహుళ చెల్లింపు విధానాల ద్వారా క్లినిక్ చెల్లింపులను స్వీకరిస్తుండడంతో ఇది సులభంగా, సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పెరుగుతున్న జనాభాతో, ఆరోగ్య సంరక్షణ డిమాండ్లు కూడా పెరుగుతున్నాయి. అభివద్ధి చెందుతున్నాయి. చిన్న పెద్ద ఆరోగ్య సమస్యలకు అత్యున్నత స్థాయి సంరక్షణను అందిస్తూ, ఆసుపత్రులు. ఎండ్-టు-ఎండ్ క్లినికల్, సర్జికల్, డయాగ్నస్టిక్ సేవలను అందించడం ద్వారా రోగులకు సురక్షితమైన స్థలాన్ని సష్టిస్తాయి. ఆసుపత్రులు అందరికీ ఆరోగ్య సంరక్షణను ఉంచుతున్నాయి. తిరుపతిలోని తిరుచానూర్ రోడ్లోని సుభోదయ రుమటాలజీ సెంటర్ నిపుణులైన వైద్య సంరక్షణను అందించడానికి కట్టుబడి ఉన్నటువంటి నమ్మకమైన ఆసుపత్రి రోగులకు ఎలాంటి ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు ఉన్నత స్థాయి పరిశు భ్రతను నిర్వహిస్తున్నాం. ఆసుపత్రులో అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రులో రోగులను ఎప్పుడైనా సంప్రదించవచ్చున్నారు. వివరాలకు 7702322499 ఫోన్ నెంబరును సంప్రదించాలి.

ప్రత్యేకతలు

- రుమటాయిడ్ ఆర్థరైటీస్
- లూపస్ (ఎస్ఎల్ఎ)
- యాసైలోసింగ్ స్పాండిలైటీస్, ఇన్ఫెక్షియస్ ఆర్థరైటీస్. సోరియాటిక్ ఆర్థరైటిస్,
- ఆస్టియో ఆర్థరైటిస్, సిపిపిడి. ఆస్టియోపోరోసిస్, ఆస్టియోమలేసియా, రికెట్స్,
- ఫైబ్రోమయారియా మయోసోటిస్. రీయాక్టివ్ ఆర్టిరైటీస్,
- జువనైల్ ఆర్టిరైటిస్. గౌటీ ఆర్థినైటిస్ వంటి వ్యాధులకు చికిత్స అందించబడును.



యోగా.. ఆరోగ్య వరప్రసాదిని..!

తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో...

తిరుపతి అర్బన్: తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో..

శ్రీపద్మావతి జూనియర్ కళాశాలలో..

తిరుచానూరు: శిల్పారామంలో..

వరదయ్యపాలెంలో...

యర్రావారిపాలెంలో..

ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. జి.ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ తిరుపతి శాఖ యోగా శిక్షకులు సురేష్ శిక్షణ ఇచ్చారు. కళాశాల అసోసియేట్ డీన్ మాట్లాడుతూ యోగాతో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు ప్రొ.సరళ, డా. లీలావతి , డా.వాణి, డా. సంతోష్, విద్యార్థి వ్యవహారాల అధికారి డా. గురివి రెడ్డి, సీనియర్ ప్రొఫెసర్లు డా. చంద్రిక, సంధ్యారాణి, వసుంధర , డా. మంజుల, రమణ, రెడ్డి కుమార్, రూపేష, వలం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు .

మహిళా వర్సిటీలో...

తిరుపతి అర్బన్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ బ్యూరో, యూనిట్, బయోటెక్నాలజీ విభాగం, బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రు ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా మాస్టర్లు శ్రీరంగం శ్రీధర్ అంబరీష, వేద పాఠశాల మేనేజర్ ఎస్వీ సురేష్, పాస్ డైరెక్టర్ మంజుల, జక్కిరెడ్డి రాణి మాట్లాడుతూ యోగా అభ్యసనంతో విద్యార్థులకు మానసిక ఒత్తిడి పెరిగి శారీరకంగా అవయవాలు బలంగా దృఢంగా తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీసీడీఈ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జయకాత్యాయని, ప్రొఫెసర్ కిషోర్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 9, జి. శిరీష, ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 10, బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పి జోష్న, ప్రొఫెసర్ ఆర్. ఉష, ప్రొఫెసర్ జాన్ సుష్మ విద్యార్థినులు పాల్గొన్నారు.

తిరుపతి అర్బన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ఉదయం ప్రిన్సిపల్ డాక్టర్ సి. భువనేశ్వరి అధ్యక్షతన యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారతదేశపు యోగా విశిష్టతను ప్రపంచానికి తెలియ చేసేందుకు యు.ఎన్.ఓ జూన్ 21న యోగా దినోత్సవంగా ప్రకటించిందని, యోగాని మన పూర్వీకులు మనకు అందించిన అద్భుతమైన సంపదని తెలిపారు. ఎస్వీయు ఐసిఎస్ఎస్ఆర్ సీనియర్ ప్రాజెక్టు ఫెలో డాక్టర్ పాకాలప హరికృష్ణ, వివేకానంద పోలీస్ ప్రెండ్స్ వ్యవస్థాపకులు ప్రేమానంద, తిరుపతి అసిస్టెంట్ ఇంజనీర్ వాటర్ రిసోర్స్ విభాగంకి చెందిన ఎం. మారుతిమోహన్ రెడ్డి , విచ్చేసి విద్యార్థినులతో యోగాసనాల్లో పాలుపంచుకున్నారు. ఎన్ఎస్ఎస్ అధ్యాపకురాలు డా" స్నేహలత, ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతి, ఎన్ సి సి అధ్యాపకురాలు నీరజ ఆధ్వర్యంలో విద్యార్థినిలు మహిళా వర్సిటీ వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బాలాయపల్లి : పిల్లలకు విద్యతోపాటు వ్యాయామం అవసరమని.. విద్యార్థులు బాల్యం నుంచే యోగాను నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నిడిగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జాతీయ వ్యాయామ దినోత్సవం కార్యక్రమం జరిగింది. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పూతేరి పాఠశాలలో బుధవారం యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. యోగాతో ఆరోగ్యంతో పాటు ఆనందం పొందవచ్చునని గురువు సురేష్ నాయుడు తెలిపారు. సహజ సంపద సంయుక్త భాగస్వామ్యంతో డైనమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డైనమిక్ యోగా మ్యూజిక్ ఫౌండేషన్ సభ్యులు బొప్పన శ్రీనివాసులు, నాగప్రసాద్, మాడ స్వామి, రామసుబ్బయ్య, మోహన్ ఘనంగా నిర్వహించారు. ప్రపంచ సంగీత యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

తిరుచానూరు: తిరుచానూరు సమీపంలోగల శిల్పారామంలో బుధవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ సనాతన ధర్మంలో యోగా ఒక భాగమని, దినసరి చర్యల్లో యోగా ఒక భాగంగా చేసుకోవాలని యోగా గురువులు చలపతి, నవీన్ పేర్కొన్నారు.

ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో...

క్యాంపస్ : తిరుపతి అర్బన్: స్థానిక ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ యోగా అసోసియేషన్ ఆఫ్ చిత్తూరు జిల్లా సహకారంతో బుధవారం నిర్వహించారు. చిత్తూరు జిల్లా యోగా అసోసియేషన్ వ్యవస్థాపకుడు కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, యోగా శిక్షకురాలు వి. హైమావతి, తహసీన్, సైన్స్ సెంటర్ క్యూరేటర్ సుదీప్ సాహా, గుణశేఖర్, జెసిఐ తిరుపతి అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి, జోనల్ విభాగాధిపతి శేష సాయి, సెక్రటరీ పావని, ట్రెజరీలు, జెసిఐ సభ్యులు, చిత్తూరు జిల్లా యోగా అసోసియేషన్ టీవ్ యోగా ఇన్స్ట్రక్టర్ కిరణ్ కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్వీ యూనివర్సిటీలో...

తిరుపతి అర్బన్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిపాలన భవనం ఎదుట బుధవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి యోగా దినోత్సవ వేడుకల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలిగిస్తుందని, సగటు ఆరోగ్య ఆయుర్దాయం పెంచుతుందని అన్నారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య తులసీ రామకృష్ణారెడ్డి, ఆచార్యులైన దామోదరం , శివశంకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పుత్తూరు కోర్టు ఆవరణలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని.. ఆరోగ్యాన్ని డబ్బుతో కొనలేమని తెలిపారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జానకి, న్యాయవాదుల సంఘం నాయకులు మురుగేశరెడ్డి, పురుషోత్తం, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణ పరిధిలోని ఆదిశంకర విద్యాసంస్థలలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మహర్షి వేదిక్ యూనివర్సిటీ హోలిండ్ భాగస్వామ్యంతో యోగా ఆసనాలు, ధ్యాన కార్యక్రమం చేపట్టారు. బి.జె.పి జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, కళాశాల డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపల్ ధనుంజయ, వేణు మాధవ్, బ్రహ్మచారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీ సరస్వతి శిశుమందిరంలో డాక్టర్ హరిప్రసాద్ (సిద్ధు అల్ట్రీ చెస్ట్ హాస్పిటల్) పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు. పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళీరెడ్డి, కోశాధికారి రామ్మోహన్, నిరంజన్‌రెడ్డి, కమిటీ సభ్యులు సుబ్బారావు, ప్రధానాచార్యులు రంగనాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: స్థానిక గ్రామ సచివాలయంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ యోగాను ప్రతిఒక్కరూ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో బసిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి అర్బన్ : ప్రతిఒక్కరి జీవితంలో యోగా ఓ భాగం కావాలని.. అప్పుడే శారీరకంగా.. మానసికంగా ప్రశాంతత పొందగలరని ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహసిన్నిసా బేగం అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్‌లో నిర్వహించారు. ఛాంబర్ ఇంటర్నేషనల్ సభ్యులు పాల్గొన్నారు.

రేణిగుంట: అంతర్జాతీయ యోగా, సంగీత దినోత్సవం పురస్కరించుకొని రేణిగుంట మండలం కరకంబాడిలో అమరరాజా విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ యోగా ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు గ్లోరి దేవప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: శ్రీకాళహస్తి అటవీశాఖ అధికారులు శ్రీకాళహస్తి రేంజ్ పరిధిలోని చింతలపాలెం నర్సరీలో యోగా డేను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ క్షేత్రాధికారి లోకేష్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ బిటి శ్రీదేవి తెలిపారు. విద్యార్థులకు వివిధ రకాల యోగా ఆసనాలు, వాటి ఉపయోగాలు గురించి వివరించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో...


బాలాయపల్లిలో...

బాలాయపల్లిలో...


గూడూరులో...

తొట్టంబేడులో..

రేణిగుంటలో..

మొబైల్ హంట్‌ను ముందుకు తీసుకొస్తున్నాం: డీఎస్పీ

ప్రజాశక్తి -గూడూరు : ఇటీవల మొబైల్స్ పోగొట్టుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని.. ఇందుకోసం మొబైల్ హంట్‌ను ముందుకు తీసుకొస్తున్నామని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి వెల్లడించారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సూచనలతో మొబైల్ హంట్ అనే పేరుతో 94906 17873 నంబరు ఇవ్వడం జరిగిందని, ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న.. దొంగలించబడ్డ వెంటనే ఈ నెంబర్ కి వాట్సాప్‌లో సమాచారం ఇవ్వాలని, అలా సమాచారం ఇచ్చే క్రమంలో ఆ నెంబర్ నుంచి పోగొట్టుకున్న మొబైల్ గురించి కొన్ని ప్రశ్నలు ఆటోమేటిక్ గా మనకు అందుతాయని, వాటికి జవాబులు పంపిస్తే వాటి ఆధారంగా మొబైల్‌ని ట్రేస్ చేయడం జరుగుతుందని, ఈ విధంగా తిరుపతి జిల్లాలో ఇప్పటికే సుమారు 250 మొబైల్ వరకు రికవరీ చేసి పెట్టామని తెలిపారు. అందరూ ఈ నెంబర్‌ని సేవ్ చేసుకొని మీ మొబైల్ లో ఎప్పుడైనా పోగొట్టుకున్న దొంగలించబడ్డ వెంటనే ఈ నెంబర్‌లో సమాచారం అందించాలని తెలిపారు.

చేనేత కష్టాలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత టిడిపి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన చేనేత పథకాలను నేడు పూర్తిగా తొలగించి ఆ స్థానంలో షరతులతో కూడిన నేతన్న నేస్తం పేరుతో రూ.24 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, చేనేతల కష్టాలు ఆలకించి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరించాలని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డి బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిబ్బాల వెంకటరమణ, రాష్ట్ర కోశాధికారి రమేష్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు వినతి ఇచ్చారు. డక్కిలిలో కొనసాగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రలో జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకులు రాష్ట్రవ్యాప్తంగా చేనేత వత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి ఇబ్బందులను వివరించారు.

ఆచార్య రాజారెడ్డికి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి- క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి అడిషనల్ చార్జ్ వైస్ ఛాన్సర్ గా వ్యవహరించిన ప్రొఫెసర్. రాజారెడ్డి ని, మహిళా విశ్వవిద్యాలయం ఘనంగా సత్కరించారు. నూతన వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.భారతి పదవీ బాధ్యతలు చేపట్టిన తరుణంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాజారెడ్డి మహిళా విశ్వ విద్యాలయ అభివృద్ధికి అందించిన సహాయ, సహకారాలకు ధన్యవాదాలు తెలియజేస్తూ బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో తాను యూనివర్సిటీ పురోగతికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెటలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని మాట్లాడుతూ ప్రొఫెసర్ రాజారెడ్డి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి ఇన్చార్జ్ ఉపకులపతిగా ఉన్నది కేవలం ఐదున్నర నెలలు మాత్రమే అయినా ఎన్నో వర్క్ షాప్ లు, సెమినార్లు, ఎం ఓ యూ లు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మీటింగ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించడంలో తన తోడ్పాటును అందించారని కొనియాడారు. వర్సిటీ అభివద్ధి పరిపాలనాపరమైన కొన్ని నిర్ణయాలలో నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకోవడంలో వారి అనుభవం ఎంతగానో ఉపయోగపడిందని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత, ప్రస్తుత శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.రాజారెడ్డి మాట్లాడుతూ మహిళా విశ్వవిద్యాలయం క్రమశిక్షణకి, అంకిత భావానికి మారుపేరని, అందుకే జాతీయంగానే కాకుండా, అంతర్జాతీయంగా కూడా విశిష్ట స్థానాన్ని సంపాదించుకుందని, ఈ విశ్వవిద్యాలయానికి ఫుల్ అడిషనల్ ఛార్జ్ వైస్ ఛాన్సర్ గా పనిచేసే అవకాశం రావడం అదష్టంగా భావిస్తున్నానని తెలియజేశారు. వివిధ విభాగాలతో పాటు ఇంకుబేషన్ సెంటర్ పనితీరును ఆయన అభినందించారు. భవిష్యత్తులో వర్సిటీ మరింత విశిష్టతను సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీన్లు ఆచార్య. సుజాత, ఆచార్య అనూరాధ, డిప్యూటీ రిజిస్ట్రార్లు, డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు, సెక్షన్ హెడ్ లు పాల్గొని ఆయనకు అభినందనలు, ధన్యవాదాలు తెలియచేసి ఘనంగా సన్మానించారు.

టీడీపీలోకి జోరుగా చేరికలు

ప్రజాశక్తి-చిట్టమూరు: ఆరూరు పంచాయతీలో వైసిపి నుంచి తెలుగుదేశంలోకి చేరిక మాజీ గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చిట్టమూరులోని తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కిషోర్ నాయుడు సమక్షంలో ఆరూరు పంచాయతీలోని రాగవారిపాలెం గ్రామానికి చెందిన పేట హరిరెడ్డి, అగ్గిబోతు మునికష్ణయ్య తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, శివారెడ్డి, రాజేష్ ,అరవింద్ ,పేట హరి రెడ్డి, రవి, మురళి, కాజా, దేవుడు, బల్లి ఉదయ్ పాల్గొన్నారు.

గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు : చిట్టేచెర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా రోజారాణి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సర్పంచ్ సెలవు పెట్టడంతో రోజారాణి కి సర్పంచ్ పదవి దక్కింది. ఎంపీపీ యుగంధర్ రెడ్డి, జడ్పీటీసీ స్వరూప, పార్టీ కన్వీనర్ గురుశంకర్, సర్పంచులు భూపాల్, మనోహర్, నాయకులు మహేంద్ర రెడ్డి, రెడ్డెప్ప నాయినివారు, సుభాస్కర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామచంద్ర, వెంకట్రామయ్య, ఎంపిడిఓ దేవేంద్ర బాబు,సచివాలయ సిబ్బంది, చిట్టెచర్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అక్కను వేధించొద్దన్నాడన్న అక్కసుతో బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం ఉప్పలవారిపాలెంలో అమరనాథ్ గౌడ్ అనే విద్యార్థిని పాశవికంగా హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలని గౌడ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అమర్నాథ్ మతికి గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళి అర్పించారు. నాగరికత అభివద్ధి చెందుతున్న ఈ రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావతం కావడం బాధాకరమన్నారు. పురుషోత్తంగౌడ్, మోహన్ గౌడ్, శ్రీరాములు గౌడ్, ఆనంద్ గౌడ్, ప్రకాష్ గౌడ్, భాస్కర్ గౌడ్ అయ్యప్ప గౌడ్, హరి గౌడ్ పలువురు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయానికి గాండ్ల కులస్థులు పని చేయాలని గాండ్ల తెలికుల రాష్ట్ర కన్వీనరు విశాలాక్షి కోరారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం గాండ్ల రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు కన్నావరం హరిబాబు ఆధ్వర్యంలో గాండ్ల కులస్థుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విశాలాక్షి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ టీడీపీతోనే గాండ్ల కులస్థుల అభివృద్ధి సాధ్యమన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గాండ్ల కులస్థులపై వివక్ష ఎక్కువైందన్నారు. కార్యదర్శి నెమల్లూరు బుజ్జి, రాష్ట్ర బిసి మైనారిటీ విభాగం షాకిరాలి, జిలాని భాష,రఫీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్,సహాయ కార్యదర్శి వజ్రం కిషోర్,పట్టణ బీసీ అధ్యక్షులు పోలూరు శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురళీరెడ్డికి ఘనంగా సన్మానం



ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని వసతిగృహ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు, వైయస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురళీరెడ్డిని బుధవారం ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షులు కే. మురళి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2014 సంవత్సర కాలానికి ఐదు సంవత్సరాల సర్వీసు ఉన్నటువంటి కాంట్రాక్టు ఉద్యోగులను శాశ్వతం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. త్వరలో అమరావతిలో జరిగే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో యూనివర్సిటీలో పనిచేస్తున్న టైం స్కేల్, ఎన్ఎంఆర్ ఉద్యోగుల గురించి చర్చించి ప్రభుత్వ సలహాదారుడు రామకృష్ణారెడ్డికి వివరాలు అందజేస్తామన్నారు. సంఘం గౌరవ ప్రెసిడెంట్ నాగరాజు, ప్రెసిడెంట్ గౌతమి, సెక్రటరీ లోకేష్, గౌరీ, గిరిబాబు, చిరంజీవి, ప్రకాష్, వెంకటేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలాక్షమ్మ ఆలయంలో అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్ మండలంలోని రామకష్ణాపురం పంచాయతీలోని పోలాక్షమ్మ ఆలయంలో దళితులకు పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని పుత్తూరు తహశీల్దారును అంబేద్కర్ ట్రస్ట్ భవన్ కోశాధికారి కుప్పయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ వినతిపత్రం సమర్పించారు. కౌన్సిలర్ బాలమురుగన్, డీలర్ రత్నం గ్రామస్థులు బాబు, చక్రపాణి , గజపతి, మనోహర్, చంద్ర, మునెయ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వారంరోజుల్లో భూములకు దారి

ప్రజాశక్తి-బాలాయపల్లి: నిండలి గ్రామంలో గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ బుధవారం పర్యటించారు. సర్వే నెంబర్ 139 లో 16 మందికి 77 సెంట్లు వంతున అసైన్మెంట్ పట్టాలు ఇచ్చి పొలాల్లోకి దారి చూపించడం లేదని బాధితుల ఫిర్యాదు మేరకు ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. ఆయన తహశీల్దార్‌ను రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ పూర్ణ, మండల సర్వేయర్ శరత్, సర్పంచి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ తెలుగుదేశం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: 'భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథం' బస్సు యాత్ర బుధవారం ఒంగోలులో ప్రారంభించిన కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర నాయకులతో కలిసి నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడులో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే బస్సు యాత్రను ప్రారంభించారు. రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ తెలుగు దేశం పార్టీ మాత్రమేనని.. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ నాలుగేళ్లలో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిం దన్నారు. మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే భవిష్యత్తుకు గ్యారంటీ బస్సు యాత్ర 125 నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజలకు వివరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

గంగమ్మను దర్శించుకున్న భరత్ రెడ్డి

ప్రజాశక్తి- తొట్టంబేడు: శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్లు గంగమ్మ జాతరలో నేషనల్ కన్స్యూమర్ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి బుధవారం గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. కొమ్మిందల మురళీకష్ణ యాదవ్ ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించి అమ్మవారి దర్శన ఏర్పాట్లు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భరత రెడ్డి పానగల్లు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాల యాదవ్, గోపాల్ యాదవ్, సురేంద్ర యాదవ్, సతీష్ యాదవ్, బన్నీ యాదవ్, వాసు యాదవ్, గణేష్, ఎతీష్ యాదవ్, మహేష్, రమేష్, లోకేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

H.M.O.P.NO.12/2023

కోగిలి సురేఖ ముడుసు సురేఖ ......పిటీషనరు

Vs

ముడుసు గురుప్రసాద్
S/o గురవయ్య 35 సంరాలు, ముద్దుమాడి గ్రామం శ్రీకాళాహస్తి మండలం, తిరుపతిజిల్లా ఆంధ్రప్రదేశ్
.......రెస్టాండెంటు

పై తెల్పిన పిటీషనరు తన భర్త అయిన ముడుసు గురుప్రసాద్ పై కోర్టులో విడాకులకు పిటీషను దాఖలు చేసి ఉన్నది. అందునిమిత్తం రెస్పాండెంటు నోటీసులు తీసుకొనకుండా తప్పించు కొంటున్నాడు. కావున సదరు రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తం పై కోర్టులో పై నెంబరు గల పిటీషన్ తేది.28-06-2023న ఉంది. కావున పై తెలిపిన రెస్పాండెంటుకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో పై కోర్టులో పై తేదిన ఉదయం 10-30 గంటలకు హాజరయి తన అభ్యంతరములు తెలుపు కొనేది.లేనిచో పై కోర్టు వారు రెస్పాండెంటుకు పై పిటీషన్ ను తనకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చెదరు.
వాయిదా :28-06-2023

ఇట్లు,
పసల చెంగయ్య, B.Com., LLB.,
పిటిషనరు తరపు న్యాయవాది,
నాయుడుపేట, సెల్ :7382020663